ప్రియమయిన వొదినకు,

కుశల ప్రశ్నలనంతరం వ్రాసేది: నాకు రీసెర్చి ఫెలోషిప్ వచ్చింది. ఈ లెక్చరర్ వుద్యోగం వొదులుకొని ఫెలోషిప్‌తో యూనివర్సిటీలో చేరా లనుకుంటున్నాను. ఫెలోషిప్ విలువ నెలకు మూడు వందల రూపాయలు. నీకు తెలియ గలందులకు వ్రాశాను. అది వస్తూ,మతిమరపునుతీసుకొచ్చింది. నా మతిమరపు గురించి వ్రాసేముందు మా అబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్ గురించి వ్రాస్తాను.

ఒకరోజు మా ప్రొఫెసర్‌ని, ఆయన స్నేహితుణ్ణి వొకరు డిన్నరుకి పిలి చారు. మా ప్రొఫెసర్‌కి పాత బ్యూక్ కారొకటుంది. 'సంసారం' సినిమా లోని బాలసరస్వతి కారులా మధ్య మధ్య ఆగిపోవటం దానికి అలవాటు. ఆగితే కొంతదూరం తోస్తేనేగాని కద లదు. డిన్నరు రోజునఆయన, స్నేహి తునితో కారులో బయలుదేరాడు. బయలుదేరిన కాసేపటికి ఆగిపోయింది. మా ప్రొఫెసరు స్నేహితుడు కారు దిగి తోయటం మొదలు పెట్టాడు. కాస్త దూరం పోయిన తరువాత కారు తిరిగి స్టార్టయింది. అంతే, తిన్నగా వచ్చి అతిథి యింటి దగ్గర ఆగింది. కారు దిగి దానిని నెట్టిన స్నేహితుడు దారి లోనే వుండిపోయాడు. ఆయన దారిలో వుండిపోయినట్లు అతిథి యింటి దగ్గర జ్ఞాపకం వచ్చింది మా ప్రొఫెసర్‌కి. తిరిగి వెనక్కిపోయి క్షమాపణ చెప్పు కున్నాడుట.




ఆయన సంగతలా వుంచు. ఆయన మేధావి. మతిమరుపుతనం ఆయనకు చెల్లింది. కాని, జీవితంలో అభివృద్ధిని ఆశించే నాలాంటి వాళ్ళకు మతిమరుపు తనం అనర్థకం కదా? సరే, అసలు విషయం వ్రాయనీ. ఆ రోజు మూడో అవర్ బి. యస్సికి ఇనార్గానిక్ క్లాసుంది. రెండో అవర్ జరుగు తుండగా ఫెలోషిప్ గ్రాంట్ అయినట్లు తెలిసింది. కొలీగ్సు అభినందనలలో గంట విన్పించింది. క్లాసుకి పోదామని ఎడమచేతిలో ఎటెండన్సు రిజిస్టరు, కుడిచేతిలో డస్టరు పట్టుకుని సుద్ద ముక్కల కోసం వెతుకుతున్నాను. ఒకటి రెండు నిమిషాలు గడిచాయి కని పించలేదు.

"ఏఁవిటి వెతుకుతున్నారు: కొత్తగా

---

రెండవ బహుమతి రూ. 25

పి. వి. సత్యాప్రసాద్,

[యమ్. ఎస్ సి., రసాయనశాస్త్ర పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వ విద్యాలయ కళాశాలలు, విశాఖపట్నం-3.]

చేరిన డిమాన్‌స్ట్రేటర్ నిరంజనం అడిగాడు.

"చాక్ పీసెస్"

"మీ చేతిలోనే వున్నాయిసార్" వ్యంగ్యంగా మళ్ళీ అతనే అన్నాడు. అక్కడవున్న నలుగురూ నవ్వారు. అవి యెడమచేతిలో రిజిస్టరు కింద ఉన్నాయ్. బయటకు పోతుండగా 'ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్' అని యెవరో అంటే మిగిలినవారు నవ్వటం విన్పించింది. సిగ్గుగా ఫీలయ్యాను.

ఆ క్లాసులో చెప్పాల్సిన పాఠం 'గంధకం.' అపేండన్పువేసి. బోర్డు మీద Sulfur అనివ్రాశాను. విద్యార్థులందరు పగలబడి నవ్వుతున్నారు. గొడవగావుంది. స్పెల్లింగు తప్పు రాశానని భావించి నవ్వుతున్నారని. 'వియ్ కెన్ ఏజ్‌వెల్ Sulphur అని అన్నా విడివిడిగ అక్షరాలు నొక్కి పలుకుతూ. అయినా నవ్వులాగ లేదు.

"వాట్ మేడ్ యూ లాఫ్?" క్లాసు మొత్తాన్ని వొకసారి చూశాను.

ఓ క్షణం నవ్వు లాగాయి.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పెండ్యులమ్ మాలతి నిలబడింది. ఆ క్లాసులో యిద్దరు మాలతులున్నారు. ఇద్దరూ రెండు జడల మాలతులే, ఈ మాలతి నడుస్తుంటే ఆమెరెండు జడలు పెండ్యులమ్స్‌లా వూగు తుంటాయి. అందుకని ఈమెను 'పెండ్యులమ్ మాలతి' అనటం మాకు (లెక్చరర్సుకి) అలవాటు.

అందరిరోకి ఈవిడ కాస్త తెగువయినది. తీరయినది. కొద్దిగా అలజడి రేగి మరోక్షణంలో నిశ్శబ్దం ఆవరించింది.

నత్తిగా "అ అ అదికాదు సార్.... మి మీ.... మిరు బోర్డు మీద ...." అంటూ బోర్డు వైపు చూపింది. వెనక్కి తిరిగి చూశాను.

మళ్ళీ అందరూ నవ్వారు

ఆశ్చర్యం! బోర్డుమీద నే వ్రాసిన అక్షరాలు లేవు. చేతిలో సుద్ద ముక్క బదులు కలం వుంది. కలంతో బోర్డు మీద వ్రాసినట్లుగా అప్పటికి అర్థమయింది.

ఆ రోజు పాఠం పూర్తయిందనిపించాను అసంతృప్తిగా.

ఇంత మతిమరపయితే రిసెర్చి యెలా చేస్తానో అని సంశయంగా వుంది. అయినా నీ ఆశీర్వచనాలతో త్వరలోనే డాక్టరేటు పొందగలనని ధైర్యంగా వుంది.

చిరంజీవి జయసేనకు దీవెనలు. అన్నయ్యకు నీకు నమస్కారాలు. వెంటనే జవాబు వ్రాయ కోర్తాను.

నీ మరది,

పరమహంస.

తా॥ క॥ ఈ జాబుని మీ చెల్లెలు సునీతకు చూపించకు.

హంస.

***